స్కెచ్

# అమ్మగారు, అయ్యగారు!

"హితశ్రీ"

రమణయ్యగారికీ, రుక్మిణమ్మగారికీ రామిమీదా, కోటయ్యమీదా, సుబ్బమ్మమీదా శ్రీరాములు మీదా పట్టలేనంత కోపమొచ్చింది.

రమణయ్యగా రెవరు?

రుక్మిణమ్మగా రెవరు?

అనే ప్రశ్నలకి మొదట చెప్పిన చివరి నలుగురూ చెప్పే జవాబులు.

అయ్యగారు

అమ్మగారు

రమణయ్యగారి హోదా గెజిటెడ్ ఆఫీసర్. రుక్మిణమ్మగారి హోదా ఆఫీసర్‌గారి భార్యామణి. పోతే—

రామి ఎవరు?

కోటయ్య ఎవరు?

సుబ్బమ్మ ఎవరు?

శ్రీరాములు ఎవరు?

అనే ప్రశ్నలకి ఆఫీసర్‌గారు గాని, వారి సతీమణిగారు గాని దర్పంగా, ఠీవిగా ఇలా జవాబివ్వగలరు—

"రామి మా పనిమనిషి, కోటయ్య మా బంట్రోతు; సుబ్బమ్మ మా వంటావిడ; శ్రీరాములు మా చాకలి."

కప్పులు పగిలిన చప్పుడు విని రుక్మిణమ్మగారు గబగబ గదిలోంచి వరుగెత్తి వొడ్లో ఆగింది. రామి పగిలిన పింగాణీ పెంకులు ఎత్తుతోంది.

"ఏమిటే అదీ?"

ఆ గర్జన విని నిలువునా వొణికి, సర్దుకుని బెదురుతూ జవాబిచ్చింది రామి—

"కప్పులు పగిలిపోయినయ్యండమ్మగారూ."

"ఎందుకనీ?"

"చేతిలోంచి జారిపోయినయ్."

"ఎందుకు జారాలిసొచ్చిందీ?"

"పొరపాటమ్మగారూ."

"కళ్ళు నెత్తిమీద కొచ్చాయా? అంతనిర్లక్ష్యమేమి?"

"జాగ్రత్తగానే పట్టుకున్నానండి."

"పైగా ఎదురుకూడా మాట్లాడతావూ? బుద్ధి లేదూ?"

"ఎందుకండమ్మా? అట్లా తిడతారు?"

"చేస్తే తప్పులేదు కాని, అంటే తప్పటు. ఎవడిచ్చుకుంటాడు, బోలెడు డబ్బు పోసికొన్నాం."

"పొరపాటన్నాను గదమ్మగారూ."

"అంటావు నీదేంపోయింది. ఈసారి జీతంలో కప్పుల ఖరీదు మినహాయించి ఇస్తాను. తరవాత నీ యిష్టం."

రామికి ఉక్రోషం వొచ్చింది. నెలరోజులూ చాకిరీచేస్తే చివరికి చేతికొచ్చేది పూజ్యం అవుతుందన్న మాట. జారిపడితే తనేం చేస్తుంది? తనేం కావాలని పగలకొట్టిందా? ఆ మాట గ్రహించదేం ఆవిడ?

"ఇంత ఖరీదుద్యోగం నాకొద్దు లెండమ్మా" విసురుగా వినవొచ్చిన రామి మాటలు విని మరింత మండిపడ్డది రుక్మిణమ్మగారు. రామి చివాలున చేసేపని అలాగే వొదిలేసి బయటికి వెళ్ళిపోయింది. అలా వెళ్ళిపోతున్న రామివైపు కొంచెం తెల్లబోయి చూసి, సణుక్కుంటూ లోపలి కెళ్ళింది రుక్మిణమ్మగారు—జరిగిన విషయాన్ని గురించి రమణయ్యగారికి ఓ చిన్న నివేదిక చిలువలు పలవలతో సహా సమర్పించటానికి. రమణయ్య ఎదుట బంట్రోతు కోటయ్య చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు.

"చూశారా ఆ రామికెంత పొగరో!"

రమణయ్యగారు వెంటనే సావధానులై "ఏం జరిగిందేమిటి?" అని వాకబు చేశారు.

జరిగిందేమిటో, జరగనిదానితోసహా పూసగుచ్చింది రుక్మిణమ్మగారు. మరో పనిమనిషిని తక్షణం కుదుర్చుకు రావలసిందిగా కోటయ్యకి

ఆర్డరు జారీ అయింది-ఆఫీసర్‌గారి నామమాత్రపు అంగీకారంతో. అయితే కోటయ్య "చిత్తం"అని మాత్రం అని, ఇంకా అక్కడనించి కదలక పోవటంతో సంగతేమిటని అడిగారు రమణయ్యగారు.

"చిత్తం. అర్జంటుగా సెలవు దయచేయించాలండి ఈ రోజు."

భయపడుతూనే అడిగాడు బంట్రోతు కోటయ్య. అనుకున్నంతా అయింది. ఆఫీసర్‌గారు తారాచువ్వలా లేచారు. వారిని తగ్గనిచ్చి విషయం సవిస్తరంగా మనవి చేసుకున్నాడు. భార్య జబ్బువిషయం, ఆస్పత్రిలో చేర్చవలసి రావటం ఇత్యాదయః. విధిలేక రమణయ్యగారు 'సరే' నన్నారు. అదే మహాభాగ్యంలా సంతోషించి కోటయ్య సెలవు తీసుకున్నాడో లేదో వంటావిడ సుబ్బమ్మగారు అడుగులో అడుగు వేసుకుంటూ రుక్మిణమ్మగారిని సమీపించి సెలవు మంజూరుకోసం దరఖాస్తు పెట్టుకుంది-ఎవరో దగ్గిర బంధువులు పోయారట.

రుక్మిణమ్మగారు ముఖం చిట్లించుకుంది. కాని ఏమనగలదు? తప్పని సరి. ముఖం నల్లబడేసుకుని "అందరికీ అన్ని అవసరాలూ ఒక్కసారేవస్తాయి" అని విసుక్కుని "సరే, దిష్టివిగ్రహంలా ఎదురుగా ఎందుకు? వెళ్ళొచ్చు" అని పర్మిషన్ ఇచ్చింది. ఆవిడ వెళ్ళిపోగానే రమణయ్యగారివైపు చూసి "చేసేదేముంది? ఆ క్యారియర్ ఏదో తెచ్చి పారేయండి" అని సలహా ఇచ్చింది రుక్మిణమ్మగారు. ఈ సలహా వినేసరికి రమణయ్యగారికి నసాళం అంటేలా కోపమైతే వొచ్చింది. కాని పైకి ఏమీ అనలేదు. తను గెజిటెడ్ ఆఫీసర్ కదా. స్వయంగా క్యారియర్‌కోసం హోటల్ కెళ్ళి పట్టించుకురావటం ఎంత న్యూనత! కాని తప్పదు. ఆయన కోపం అంతా బంట్రోతుమీదికి మళ్ళింది. వాడుకూడా ఇప్పుడే సెలవుపెట్టాలి!

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"పోనీ, నువ్వే కుంపటిమీద కాసిని బియ్యం పెట్టకూడదూ, ఇవాళ్టికి?"

రుక్మణమ్మగారికి కొంచెం కష్టంవేసింది, చిన్నబుచ్చుకుంది.

"పారేసేదాన్నే. కాని ఆ రామి అంట్లు కూడా తోమకుండా వెళ్ళింది. ఎలామరి?"

అవును, అదీ పాయింటే. ఇంట్లో వండటం సాధ్యపడదన్నమాటే. రమణయ్యగారు పాపం, నిరుత్తరుడై "సరే, ఓ ధోవతీ, షర్టూ ఇలా పడెయ్యి"అన్నారు.

తక్షణం రుక్మణమ్మగారిముఖం నలుపు తెలుపు రంగులు మార్చింది.

"ఆ శ్రీరాములు బట్టలు తేనేలేదే— మరిచి పోయాను. మీవన్నీ మాసిపోయాయి."

"ఆ!"అన్నారు రమణయ్యగారు ఆందోళనగా. ఆఫీసుకెలా వెళ్ళటం? క్యారియర్ సంగతి దేవుడెరుగు.

"ఆ చాకలికి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదు. సమయానికి బంట్రోతుకూడాలేదు. ఇవాళే వంటావిడా ఎగ్గొట్టింది. ఛీ, అన్నీ ఒక్కసారే వొస్తాయి."

"ఇప్పుడేమిటి చెయ్యటం?"

రమణయ్యగారు తక్షణ కర్తవ్యం గురించి సమాలోచన జరపటానికి ప్రయత్నించారు.

"ఏం చేస్తాం?" నిస్పృహ వెల్లడించింది రుక్మిణమ్మగారు.

ఆ క్షణంలో—రమణయ్యగారికీ, రుక్మిణమ్మగారికీ రామిమీదా, కోటయ్యమీదా, సుబ్బమ్మమీదా, శ్రీరాములుమీదా ఎనలేని కోపమొచ్చింది.

"ఆ చాకలికి ఇవాళే ఉద్వాసన చెప్పేశాననుకో." అన్నాడు కోపఘూర్ణితమానసులై, రమణయ్యగారు.

"ఆ రామిని ఇందాకనే డిస్‌మిస్ చేశాను." అంది రుక్మిణమ్మగారు హెచ్చుస్థాయిలో.

"ఆ బంట్రోతు కోటయ్యగాడిని తీసిపారేస్తాను."

"ఆ సుబ్బమ్మని రేపటినించీ రానక్కర్లేదని చెప్పేస్తాను."

అంతగా కోపమొచ్చింది — ఆఫీసర్‌గారికీ ఆఫీసర్‌గారి భార్యకీ, పనిమనిషిమీదా, బంట్రోతుమీదా, వంటావిడమీదా, చాకలిమీదా.

అంతే! ఇక దమ్మిడీకూడా వారిదగ్గర్నించి వీరి దగ్గిరికిపోదు. దమ్మిడీకూడా!

ఆ పరిస్థితిలో—

రమణయ్య ఎవరు?
రుక్మిణమ్మ ఎవరు?
రామి ఎవరు?
కోటయ్య ఎవరు?
సుబ్బమ్మ ఎవరు?
శ్రీరాములు ఎవరు?

మొదటి ఇద్దరుమనుషులకీ, మిగతా నలుగురు మనుషులతో గల సంబంధం ఎటువంటిది?

అయితే, ఈప్రశ్నకి సమాధానం రమణయ్య దంపతుల దగ్గిర దొరకదు. వాళ్ళకీవిషయంగురించి ఆలోచించే అవసరమే ఉండదు. ఎందుకంటే మర్నాడు పనిమనిషి క్షమాపణ కోరుకుంటుంది; బంట్రోతు దయుంచమంటాడు; వంటావిడ బ్రతిమాలుకుంటుంది; చాకలి ప్రాధేయపడతాడు. అంతట అయ్యగారు, అమ్మగారు తమకోపాన్ని దయతో ఉపసంహరించుకోగలరు!

---

స్కెచ్

# 'బుర్ర' కథ

కె. రామలక్ష్మి

గంగాధరం చచ్చిపోయాడని విన్నరోజునే అనుకున్నాను-నా తలకీ ఒక ఎక్సరే తీయిద్దామని. కాని అవసరం వుండదన్నాడు వైద్యుడు.

"దీనిని గురించి ఎవరికీ యేమీ తెలియదు!" అన్నాడు వైద్యుడు. "మాకు తెలిసినంతమటుకూ, దేనికైనా రెండురకాల పెరుగుదల ఉంటుంది- ప్రమాదకరమైనదైవుండీ పైకి తెలియనిదీ, వుండీ ప్రమాదం లేకుండా దయచూపేదీ; వీట్లో ఏది ఎందుకువుందన్నా కారణం చెప్పలేం, అదేమీరు కనుక్కో గలగాలి" ఏమేమిటో చెప్పుకుపోతు న్నాడు.

"నేనా? నే తెలుసుకోవాలంటారా?" అన్నా ఆశ్చర్యపోతూ.

"ఆఁ సరిగ్గా అదే అంటున్నాను. చాలామంది కంటే బాగానే వూహించారు."

"బాగానే వుంది. కాని వుండుండి వచ్చే ఈ తలలో పోట్లు గురించి ఏమంటారు?"

"బాగుంది, కాని అప్పుడప్పుడు వచ్చే నా పోట్లు సంగతోమరి? చూశారూ! యిదేం ప్రకృతికి విరుద్ధంకాదు. మన బతుకులో ఒక భాగం. దాటిపోలేని ఒకభాగం!"

"నా బాధ వేరండీ. అందరికీ వుండొచ్చు. కాని, నా పోట్లు వేరు" అన్నాను గట్టిగానే.

"అబ్బాయ్,నువ్వు రచయితవనీ, కవిత్వం రాస్తావనీ నీకు ప్రత్యేకించి తల్లోపోట్లు వస్తున్నాయని అనుకోకు... పిచ్చికాని అందరూ క్షణక్షణం కొద్దికొద్దిగా చచ్చిపోతూనే వుంటారు. హాయిగా ఆందోళనా రహితంగా బతకాలంటే, యీ పోట్ల విషయం మరచిపో......" వేదాంతిలా తేల్చి చెప్పాడు వైద్యుడు.

"నిజంగానే అంటున్నారా?" అన్నాను. భయమేమిటి? అనుకుంటున్నా భయంతో శరీరం ఒణికింది.

"అలా భయపడతావేమిటోయ్? అది నిజం అని నీకూ తెలుసు. నాకంటెకూడా దృఢంగా తెలుసు. మనలో ప్రతివాడూ చావుకి క్షణం దూరంలోనే వుంటాడనుకో. మునిగిపోయేవాడికి ప్రాణవాయువు లేకుంటేనూ, ప్రమాదమైన పదార్థాన్ని అమాంతం ఢీకొంటేనూ... కొద్దిక్షణాల్లో కళ్లుమూసేస్తారు...యివన్నీ ప్రమాదాలనుకో... మామూలుగాకూడా మనిషి ఎప్పుడూ మృత్యువుకి నిముషం దూరంలోనే వుంటాడోయ్! వెర్రివాడా భయపడకు" వైద్యుడు ఓదార్పుస్వరంతో చెప్పాడు. తలలో పోట్లుసంగతి యింక మరిచిపోవడానికే నిశ్చయించుకున్నాను.

అయినాకూడా గంగాధరం మరణం నన్ను బాధపెడుతూనే వుంది. ఈ సంవత్సరంలో ఎక్కువబాధపెట్టింది అతని చావువార్త ఒక్కటే. చిన్నవాడు, పైకిరావలసినవాడు, హఠాత్తుగా కళ్లుమూసేసాడు. వెంకయ్యతాతతో అన్నాను-